నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
11 | హైదరాబాద్, గురువారం 15 ఫిబ్రవరి 2024 | SANGAREDDY

వసంత వైభవం

- చదువులతల్లికి జననీరాజనం
- పోటెత్తిన భక్తజనం
- సరస్వతీమాతకు భక్తుల ఒడిబియ్యాలు
- చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం
- భక్తులతో కిక్కిరిసిన సిద్దిపేట జిల్లా వర్గల్ విద్యాధరిక్షేత్రం

సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలంలో సరస్వతీమాతను వేడుకుంటున్న భక్తులు

సరస్వతీ నమస్తుభ్యం

సరస్వతీక్షేత్రంలో బ్రహ్మోత్సవాలు

చిన్నకోడూరు, ఫిబ్రవరి 14: దేశంలోనే మొట్టమొదటి వీణాపాణి మొదటి సరస్వతీ క్షేత్రం ప్రకృతి ఒడిలో చదువుల తల్లి విరాజిల్లుతున్నది. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలంలో సహజసిద్ధమైన ప్రకృతి సోయగాల నడుమ సరస్వతీ క్షేత్రం వెలిసింది. ఈ క్షేత్రంలో సరస్వతీమాత పుట్టిన రోజును (వసంత పంచమి) పురస్కరించుకొని బుధవారం వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల నిర్వహణకు ఆలయాన్ని సుందరంగా విద్యుత్ కాంతులతో అలంకరించారు. సరస్వతీమాతకు ప్రత్యేక పూజలతోపాటు అక్షర స్వీకారం, కుంకుమార్చనలు, ఒడిబియ్యం, సామూహిక అక్షరాభ్యాసం, వ్రతాలు నిర్వహించారు. సిద్దిపేట జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

చిన్నకోడూరు సరస్వతీ క్షేత్రంలో కూతురుకు అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు

సిద్దిపేట జిల్లా వర్గల్ మండలంలోని విద్యాసరస్వతీ మాత ఆలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

సిద్దిపేట జిల్లా వర్గల్ మండలంలోని విద్యాసరస్వతీ మాత

వర్గల్, ఫిబ్రవరి14: సిద్దిపేట జిల్లా వర్గల్ మండలంలోని విద్యాసరస్వతీ మాత ఆలయం భక్తులతో కిటకిటలాడింది. బుధవారం వసంతపంచమి (శ్రీపంచమి) వేడుకలు ఆధ్యాత్మికశోభ ఉట్టిపడేలా జరిగాయి. సరస్వతీఅమ్మవారి దివ్యసన్నిధానంలో ఉదయం ఆలయ వ్యవస్థాపక, శాశ్వత అధ్యక్ష చైర్మన్ బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖరశర్మసిద్ధాంతి స్వీయపర్యవేక్షణలో నాలుగు గంటల ప్రాంతంలో అమ్మవారికి వేదమంత్రోచ్చారణల మధ్య విశేషపంచామృతాభిషేకాలు జరిపించారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని శంభుడిగిరి కొండల చుట్టూ ప్రదక్షిణం చేయించారు. పుస్తకపూజ, చప్పన్‌భోగ్, కుంకుమార్చన, లక్షపుష్పార్చన, చండీహోమం నిర్వహించారు. పెద్దఎత్తున భక్తుల రాకతో ఆలయ రోడ్లన్నీ రద్దీగా మారాయి. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. మధ్యాహ్నం వరకు ఆరువేలకుపైగా అక్షరాభ్యాసాలు పూర్తయినట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. మహా అన్నప్రసాదం వద్ద సాయంత్రం వరకు జనసమూహం కనిపించింది. వసంతమహోత్సవాన్ని పురస్కరించుకొని పీఠాధిపతులు విద్యానృసింహభారతి, మాధవానందసరస్వతీస్వామి, మధుసూదనందసరస్వతీస్వామిలతోపాటు సిద్దిపేట జడ్పీ చైర్పర్సన్ వేలేటి రోజాశర్మ, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి తదితరులు విద్యాసరస్వతీమాతను దర్శించుకున్నారు.

సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలంలో భక్తులతో కిక్కిరిసిన సరస్వతీక్షేత్రం

చదువులతల్లికి నీరా'జనం'

న్యాల్‌కల్, ఫిబ్రవరి 14: సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం రాఘవపూర్ సిద్ధ సరస్వతీ దేవి పంచవటీ క్షేత్రం భక్త'జన' సంద్రమైంది. సరస్వతీ నమస్తుభ్యం..వరదే కామరూపిణీ..శ్లోకాలతో అమ్మవారి ఆలయం మార్మోగింది. బుధవారం వసంత పంచమిని పురస్కరించుకుని క్షేత్ర పీఠాధిపతి కాశీనాథ్‌బాబా ఆధ్వర్యంలో వైదేహి అయ్యప్పస్వామి పర్యవేక్షణలో వేదపండితులు అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, సరస్వతీయాగం, హారతి తదితర పూజలు చేశారు. జిల్లా నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. పవిత్రమైన మంజీరానదిలో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం ప్రత్యేక బారికేడ్ల గుండా వెళ్లి గంగామాత, సరస్వతీ అమ్మవారితో పాటు సాయిబాబా, సూర్యభగవాన్, జ్యోతిర్లింగాలు, శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించేందుకు ఆయా ప్రాంతాల నుంచి తల్లిదండ్రులు తరలివచ్చారు. క్షేత్ర పీఠాధిపతి కాశీనాథ్ బాబా, వైదపండితులు చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథంలో కాశీనాథ్‌బాబా వేలాది మంది భక్తులతో కలిసి మంజీరానది వరకు పాదయాత్ర చేపట్టారు. అనంతరం మంజీరానదిలో గంగమ్మకు ప్రత్యేక పూజలు చేసి తెప్పను విడిచిపెట్టారు. వివిధ ప్రాంతాల నుంచి బోనాలతో తరలివచ్చిన మహిళలు మంజీరానది వద్ద గంగమ్మకు, గంగామాత ఆలయంలోని అమ్మవారితో పాటు శివలింగానికి భక్తులు పూజలు చేశారు. వేలాది మంది మహిళలు బోనాలు ఎత్తుకొని పంచవటీ క్షేత్రానికి పాదయాత్రగా తరలివచ్చారు. అనంతరం ప్రదక్షిణలు చేసి ధ్వజాస్తంభం వద్ద నైవేద్యాలు, బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. జహీరాబాద్ రూరల్ సీఐ నోముల వెంకటేశ్ ఆధ్వర్యంలో హద్నూర్ ఎస్సై రామానాయుడు పర్యవేక్షణలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆయా ప్రాంతాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం పంచవటీ క్షేత్రానికి రథంపై ఊరేగింపుగా వస్తున్న పీఠాధిపతి కాశీనాథ్ బాబా

అక్షరాభ్యాస సామగ్రి అందజేత

బీజేపీ రాష్ట్ర నాయకుడు, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ మాజీ చైర్మన్ ఎం. జైపాల్‌రెడ్డి రాఘవపూర్‌లోని సిద్ధ సరస్వతీదేవి పంచవటీ క్షేత్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా క్షేత పీఠాధిపతి కాశీనాథ్‌బాబాతో కలిసి అక్షరాభ్యాస సామగ్రిని తల్లిదండ్రులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బుచ్చిరెడ్డి, శివాజీపాటిల్, మోహన్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, ఏక్‌నాథ్‌పాటిల్, ఓంకర్‌యాదవ్, జైపాల్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

సిద్దిపేట జిల్లా వర్గల్ మండలంలోని విద్యాసరస్వతీమాత ఆలయంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు

వైభవంగా వసంత పంచమి

మెదక్ జిల్లా పేరూరు ఆలయంలో సరస్వతీమాతకు హారతి ఇస్తున్న పండితుడు

మెదక్‌రూరల్, ఫిబ్రవరి14: మెదక్ జిల్లాలోని గరుడగంగ సరస్వతీ ఆలయంలో వసంత పంచమి వేడుకలు వైభవంగా జరిగాయి. బుధవారం మెదక్ మండల పరిధిలోని పేరూరు గ్రామ శివారులోని మంజీరాతీరంలో వెలిసిన గరుడ గంగ సరస్వతీమాత 21వ వార్షికోత్సవం, వసంత పంచమిని పురస్కరించుకుని ఉదయం నుంచే ఆలయానికి భక్తులు పోటెత్తారు. అమ్మవారికి మహాబాలాభిషేకం, అలంకారం, సరస్వతీయజ్ఞం, పూర్ణాహుతి తదితర పూజలు చేశారు. దోర్బల రాజమౌళిశర్మ, మహేశ్‌శర్మ చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం అమ్మవారికి భక్తులు ఒడిబియ్యం సమర్పించారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం ఆలయం చుట్టూ ఎడ్లబండ్ల ఊరేగింపు నిర్వహించారు. జిల్లాలోని భక్తులే కాకుండా ఇతర జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో జనం తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి.

సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం పంచవటీ క్షేత్రానికి బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

న్యాల్‌కల్ మండలం మంజీరా నదిలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

'ప్రజల్లో చైతన్యం కల్పించాలి'

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 14: పోలీస్ కళాబృందం, సాంస్కృతిక సారథి సభ్యులు ప్రజల్లో చైతన్యం కల్పించే కార్యక్రమాలు నిర్వహించాలని సిద్దిపేట సీపీ అనురాధ అన్నారు. బుధవారం సిద్దిపేట పోలీస్ కమిషనరేట్‌లో పోలీస్ కళాబృందం, సిద్దిపేట జిల్లా తెలంగాణ సాంస్కృతిక సారథి సభ్యులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ..మూఢనమ్మకాలు, బాణామతి, సైబర్ నేరాలు, గృహహింస, గంజాయి, ఇతర మత్తు పదార్థాలు, రోడ్డు ప్రమాదాలు, ఆత్మహత్యలు, సామాజిక రుగ్మతలపై సమష్టిగా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఆర్‌వో రవి, తెలంగాణ సాంస్కృతిక సారథి సభ్యులు పాల్గొన్నారు.

పోలీస్ కళాబృందం, సాంస్కృతిక సారథి సభ్యులతో మాట్లాడుతున్న సిద్దిపేట సీపీ అనురాధ

అన్ని బ్యాంకులు లక్ష్యాన్ని సాధించాలి

డీసీసీ సమావేశంలో సిద్దిపేట కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

సమావేశంలో మాట్లాడుతున్న సిద్దిపేట కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 14: వ్యవసాయ శాఖలోని గ్రౌండ్ లెవెల్ సిబ్బంది సహాయంతో ఫిబ్రవరి నాటికి అన్ని బ్యాంకులు లక్ష్యాన్ని సాధించాలని సిద్దిపేట కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ ఆదేశించారు. బుధవారం సిద్దిపేట కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ కన్సల్టెన్సీ కమిటీ(డీసీసీ), డిస్ట్రిక్ట్ లెవెల్ రివ్యూ కమిటీ(డీఎల్ఆర్‌సీ) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. రూ.5,920 కోట్ల లక్ష్యానికి రూ.4,305 కోట్లతో 73 శాతం వ్యాపారం సాధించినందుకు బ్యాంకర్లను అభినందించారు. పశుసంవర్ధక, మత్స్యపరిశ్రమ కింద కిసాన్ క్రెడిట్ కార్డులు బ్యాంకుల ద్వారా మంజూరు చేస్తారన్నారు. నాబార్డులో అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ పథకం ఉందని.. అర్హులైన లబ్ధిదారులందరికీ 6 శాతం వడ్డీతో సెక్యూరిటీ లేకుండా రూ.2 కోట్ల రుణం లభిస్తుందన్నారు. ఎస్‌హెచ్‌జీ గ్రూపు రుణాల లక్ష్యాలను ఫిబ్రవరి 2024 నాటికి పూర్తి చేయాలని, అన్ని బ్యాంకుల అధికారులను అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్ ఆదేశించారు. సమావేశంలో సిద్దిపేట డీఆర్డీవో జయదేవ్ ఆర్యా, ఇతర శాఖల అధికారులు, బ్యాంకుల ప్రాంతీయ కార్యాలయ అధికారులు పాల్గొన్నారు.

నీళ్లివ్వకపోతే రాజీవ్ రహదారిని నిర్బంధిస్తాం

ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి
సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం సంగారెడ్డి లిఫ్ట్ కాల్వ వద్ద ధర్నా

కొండపోచమ్మసాగర్ నుంచి నీటిని విడుదల చేయాలని ధర్నా చేస్తున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి తదితరులు

వర్గల్, ఫిబ్రవరి14: రైతులకు నీళ్లివ్వకపోతే రాజీవ్ రహదారిని నిర్బంధిస్తామని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. లక్ష ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో నిర్మించిన కొండపోచమ్మసాగర్ ప్రాజెక్టు నుంచి వెంటనే గోదావరి జలాలు విడుదల చేయాలని కోరుతూ బుధవారం సిద్దిపేట జిల్లా వర్గల్ మండలంలోని సంగారెడ్డి లిఫ్ట్ కాల్వ వద్ద డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి, బీఆర్ఎస్ కార్యకర్తలతో కలిసి ఆయన ధర్నా చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంటపొలాలు ఎండిపోతే చూస్తూ ఊరుకోమన్నారు. కొండపోచమ్మసాగర్ ప్రాజెక్టు సంగారెడ్డి కాల్వ ద్వారా 15 వేల మంది రైతులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. నీటిని వెంటనే విడుదల చేయాలని లేకుంటే రాజీవ్ రహదారిని వేలాదిమంది కార్యకర్తలతో స్తంభింపచేస్తామని హెచ్చరించారు. ఆరుగ్యారెంటీల పేరు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇప్పటివరకు ఆర్టీసీ బస్సు మినహా ఇతర హామీలు నెరవేర్చలేదని మండిపడ్డారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల మీద దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రావెల్ బస్సును ఢీకొన్న లారీ

వృద్ధుడు మృతి, 15 మందికి తీవ్రగాయాలు
గాయపడినవారిని సిద్దిపేట ప్రభుత్వ దవాఖానకు తరలింపు

మెదక్ జిల్లా నిజాంపేట గ్రామ శివారులో ప్రమాదానికి గురైన లారీ, ట్రావెల్ బస్సు

నిజాంపేట, ఫిబ్రవరి14: ట్రావెల్ బస్సును లారీ ఢీకొనడంతో వృద్ధుడు మృతి చెందగా మరో 15 మందికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన మెదక్ జిల్లా నిజాంపేట గ్రామ శివారులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సిద్దిపేట జిల్లా పాలమాకుల గ్రామానికి చెందిన విజయ్ వివాహం బుధవారం మెదక్ పట్టణంలో ఉంది. పెండ్లికొడుకు బంధువులు సిద్దిపేట నుంచి ట్రావెల్ బస్సులో మెదక్ వైపు ప్రయాణిస్తుండగా నిజాంపేట గ్రామ శివారుకు రాగానే ఎదురుగా చేగుంట నుంచి సిద్దిపేటకు వస్తున్న లారీ ట్రావెల్ బస్సును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న 16 మందికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108లో సిద్దిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. చేర్యాల లింగయ్య (74) అనే వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య విజయలక్ష్మి, కూతురు లలితకు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. బస్సు నడిపిన డ్రైవర్ శ్రీనివాస్‌కు తీవ్రగాయాలయ్యాయి. మృతుడు లింగయ్య కుమారుడు రామరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు నిజాంపేట ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఘటనా స్థలాన్ని సీఐ వెంకటేశ్ పరిశీలించారు.

నూతన పద్ధతులు అలవర్చుకోవాలి

మెదక్ కలెక్టర్ రాజర్షి షా

మెదక్ కలెక్టరేట్‌లో అగ్రిటెక్ సౌత్ 2024 పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

మెదక్, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ): నూతన పద్ధతులు అలవర్చుకోవాలని మెదక్ కలెక్టర్ రాజర్షి షా సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో బుధవారం ఆయన అగ్రిటెక్ సౌత్ 2024 పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ...ఈ నెల 16 నుంచి 18వతేదీ వరకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అగ్రిటెక్ సౌత్ – 2024 ఎగ్జిబిషన్, సదస్సు నిర్వహిస్తున్నారన్నారు. వ్యవసాయ ఉత్పత్తులు వాటి పెంపకం, పునరుత్పత్తి వ్యవసాయం, పశుసంరక్షణ, చేపలు, కోళ్ల పెంపకం, ఆయిల్‌పామ్ సాగు, వ్యవసాయ యాంత్రీకరణ, పోషక భద్రత, ఉద్యాన పంటలు, సమీకృత వ్యవసాయ పద్ధతులు, అగ్రి స్టార్టప్‌ల గురించి చర్చిస్తారన్నారు. వివిధ వ్యవసాయ ఉపకరణాలపై 150 స్టాల్స్ ఏర్పాటు చేస్తారన్నారు. విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ రసాయనాలు, వ్యవసాయ పరికరాలు, పాడి పరిశ్రమ, మత్స్యపరిశ్రమ, సేంద్రియ వ్యవసాయం, వ్యవసాయంలో డిజిటల్ సాంకేతిక అంశాలపై రెండు రోజులు కాన్ఫరెన్స్‌లు ఉంటాయన్నారు. మెదక్ జిల్లా వ్యవసాయాధికారి గోవింద్, వ్యవసాయ సహాయ సంచాలకులు వినయ్‌కుమార్, రాజ్‌నారాయణ పాల్గొన్నారు.

కొమురవెల్లిలో రైల్వేస్టేషన్

నేడు నిర్మాణ పనులకు భూమిపూజ
హాజరుకానున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, మధ్యప్రదేశ్ సీఎం మోహన్‌యాదవ్

చేర్యాల, ఫిబ్రవరి 14: సిద్దిపేట జిల్లాలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మధ్యప్రదేశ్ సీఎం మోహన్‌యాదవ్ గురువారం పర్యటించనున్నారు. కొమురవెల్లి మల్లికార్జున స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన అనంతరం మల్లన్న క్షేత్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో రైల్వేస్టేషన్(హాల్ట్) నిర్మాణ పనులకు దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులతో కలిసి వారు భూమిపూజ చేయనున్నారు. కొమురవెల్లి ఆలయానికి వచ్చే రహదారి పక్కన రైల్వేస్టేషన్ నిర్మాణానికి సంబంధిత అధికారులు ఇటీవల స్థలాన్ని ఎంపిక చేశారు. దీంతోపాటు భూమిపూజ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. భూమిని చదును చేసి శిలాఫలకం తదితర పనులు పూర్తి చేశారు. ఇప్పటికే వరంగల్, కరీంనగర్, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి బస్సు సౌకర్యం ఉన్న కొమురవెల్లి క్షేత్రానికి ఇక రైల్వేస్టేషన్ రావడంతో భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. భూమిపూజా కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరుకానున్నారు.

సిద్దిపేట జిల్లా కొమురవెల్లిలో రైల్వేస్టేషన్(హాల్ట్) నిర్మాణ పనులు చేసే ప్రదేశం